నమస్తే తెలంగాణ
ములుగు
జయశంకర్ భూపాలపల్లి
5 | వరంగల్, సోమవారం 9 జూన్ 2025 | MULUGU JAYASHANKAR BHUPALPALLY







## ఎమ్మెల్యే గోపీనాథ్‌కు పలువురి నివాళి

జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్‌కు పలువురు నివాళులర్పించారు. ఆదివారం హైదరాబాద్ మాదాపూర్‌లోని ఆయన నివాసానికి శాసనమండలిలో ప్రతిపక్ష నేత సిరికొండ మధుసూదనాచారి, రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర చేరుకొని గోపీనాథ్ భౌతికకాయానికి అంజలి ఘటించారు. అనంతరం కుటుంబసభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. అలాగే హనుమకొండలోని బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్‌భాస్కర్, పలువురు బీఆర్‌ఎస్ నాయకులు గోపీనాథ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

### మాగంటి మృతిపై మాజీ మంత్రి ఎర్రబెల్లి సంతాపం

దేవరుప్పుల, జూన్ 8 : జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ మృతి పట్ల మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు సంతాపం తెలియజేశారు. గోపీనాథ్ మృతి తనకు దిగ్భ్రాంతి కలిగించిందని, అతని కుటుంబానికి తన ప్రగాఢ సానుభూతిని తెలుపుతున్నట్లు అమెరికా నుంచి ఒక ప్రకటన ద్వారా పేర్కొన్నారు. ప్రజానేతగా పేరొందిన గోపీనాథ్ సౌమ్యుడని, జూబ్లీహిల్స్ ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోతాడని తెలిపారు. బీఆర్‌ఎస్ సీనియర్ నేతగా తనదైన శైలితో నియోజకవర్గ అభివృద్ధికి కృషిచేశాడని అతని పవిత్ర ఆత్మకు శాంతి కలగాలని దేవున్ని ప్రార్థిస్తున్నట్టు తెలిపారు.

## రాంచంద్రూనాయక్‌కు డిప్యూటీ స్పీకర్



నర్సింహులపేట/పెద్దవంగర, జూన్ 8 : డోర్నకల్ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ జాటోత్ రామచంద్రూనాయక్‌కు డిప్యూటీ స్పీకర్ పదవి దక్కింది. పెద్దవంగర మండలంలోని మారుమూల సర్పంచ్‌తండాలో రామునాయక్–మారు దంపతులకు జన్మించిన ఈయన.. వైద్యవృత్తిలో కొనసాగుతూ ప్రజలకు సేవలందించారు. 2006లో రాజకీయ అరంగేట్రం చేసి ఒకసారి టీడీపీ నుంచి మరోసారి కాంగ్రెస్ నుంచి ఎమ్మెల్యేగా పోటీ చేసి ఓటమి పాలయ్యారు. 2023 ఎన్నికల్లో తొలిసారి ఎమ్మెల్యేగా ఎన్నికై ప్రభుత్వ విప్ గా ఉన్నారు. ఆదివారం మంత్రివర్గ విస్తరణలో భాగంగా ఎస్టీ కేటగిరీలో డిప్యూటీ స్పీకర్ పదవి కట్టబెట్టాలని నిర్ణయించగా త్వరలో నోటిఫికేషన్ జారీ కానుంది.




మహబూబాబాద్‌లో ప్రమోద్ రెడ్డి నిర్మాణాల వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న గిరిజన రైతులు

## మా ఓట్లతో గెలిచి అగ్రవర్ణాలకు కొమ్ము కాస్తావా?

### ఎమ్మెల్యే మురళీనాయక్ అడ్డగింత

మహబూబాబాద్ రూరల్, జూన్ 8 : 'మా ఓట్లతో గెలిచి అగ్రవర్ణాలకు కొమ్ము కాస్తవా' అని మహబూబాబాద్ ఎమ్మెల్యే డాక్టర్ భూక్యా మురళీ నాయక్‌కు ఆదివారం గిరిజనులు అడ్డగించారు. పట్టణానికి చెందిన ప్రముఖ డాక్టర్ ప్రమోద్ రెడ్డి పది మంది గిరిజన రైతులకు సంబంధించిన 30 ఎకరాల భూమిని ఆక్రమించి, అందులో పెద్దపెద్ద భవనాలతో పాటు ఓ పాఠశాల భవనాన్ని సైతం నిర్మించాడని ఆరోపించారు. ఆదివారం స్కూల్ ప్రారంభోత్సవానికి ఎమ్మెల్యే వెళ్తున్న క్రమంలో గిరిజన రైతులు అడ్డుకొని రోడ్డుపై ఆందోళన చేశారు. గిరిజన రైతులకు అండగా నిలవకుండా ప్రమోద్‌రెడ్డికి సపోర్ట్ చేస్తూ పాఠశాల ప్రారంభోత్సవానికి ఎలా వెళ్తావు అని ఎమ్మెల్యేను నిలదీశారు. సమాచారం తెలుసుకున్న టౌన్ పోలీసులు, సీఐ పెండ్యాల దేవేందర్ అక్కడికి చేరుకుని వారికి సర్ది చెప్పే ప్రయత్నం చేశారు. అయినా వారు వినకపోవడంతో చాలా సేపు వాహనంలోనే ఉండి చేసేదేమీ లేక ఎమ్మెల్యే మురళీనాయక్ స్కూల్ ప్రారంభించకుండానే తిరిగి వెళ్లాడు. కాగా, గిరిజన రైతులు బోడ రమేశ్ నాయక్, భూక్యా శ్రీను మీడియాతో మాట్లాడుతూ శనిగపురం శివారులోని 275,278,279 సర్వే నంబర్‌లో 30 ఎకరాల గిరిజనులకు సంబంధించిన భూమిని ప్రమోద్ రెడ్డి, అతని అనుచరులు కలిసి ఫోర్జరీ డాక్యుమెంట్లు సృష్టించి రెవెన్యూ వ్యవస్థను తప్పుదోవ పట్టించారన్నారు. ఈ భూములను కబ్జా చేసినందుకు గతంలో ప్రమోద్‌రెడ్డిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదైందని, జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు హుస్సేన్ నాయక్ ఆదేశాల మేరకు పోలీసులు పూర్తి విచారణ సైతం చేశారని పేర్కొన్నారు. అనేక సంవత్సరాల నుంచి తమ భూముల గురించి అధికారులు, ప్రజాప్రతినిధులకు మొరపెట్టుకుంటున్నా వారు అగ్రవర్ణాలకు కొమ్ము కాస్తున్నారని ఆరోపించారు. ఇప్పటికైనా వెంటనే గిరిజన భూములపై పూర్తి విచారణ చేసి న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో గిరిజన రైతులు బాలాజీనాయక్, లాల్‌సింగ్ నాయక్, రవీందర్‌నాయక్, మ ల్సూర్, భిక్షం, కిరణ్ నాయక్, సంతోష్, వీరేందర్, రూప్లి బాయి, శాంతి, తార, కల్పన, మహేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

### మృతుల్లో అన్నదమ్ములు..

గోదావరిలో గల్లంతై మృతిచెందిన వారిలో నలుగురు అంబట్‌పల్లికి చెందిన వారే. పట్టి మధుసూదన్, పట్టి శివమనోజ్, తొగరి రక్షిత్, కర్ణాల సాగర్ గోదావరి నదిలో గల్లంతు కావడంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. ఇందులో ఒకే కుటుంబానికి చెందిన ఇద్దరు అన్నదమ్ములు మృతి చెందగా ఆ కుటుంబానికి పెద్దదిక్కు లేకుండా పోయింది. పట్టి వెంకటస్వామి కళ్ల ముందే ఆరుగురు నీటిలో గల్లంతు కావడం, అందులో ఇద్దరు తన కుమారులు ఉండడం అతన్ని అచేతన స్థితికి చేర్చింది. పెళ్లింట సంబురాలు ఒక్క రోజుకే పరిమితమయ్యాయి. అంతా శోకసంద్రంలో మునిగిపోయారు. అలాగే మహాముత్తారం మండలం కొర్లకుంట, స్తంభంపల్లి గ్రామాల్లో ఇద్దరు మృతిచెందారు.

### శవమై వస్తడనుకోలేదు..



నాకు ఇద్దరు కొడుకులు. పెద్ద కొడుకు బీటెక్ చదువుతున్నడు. చిన్నోడు ఈ మధ్యనే పదో తరగతి పూర్తి చేసిండు. అంబట్‌పల్లిలో పెళ్లికి వెళ్లిన చిన్న కొడుకు తిరిగి రాని లోకాలకు వెళ్లడం మాకు తీరని లోటు. మాకు వ్యవసాయం లేదు. కూలీ పని చేసుకొని బతుకుతున్నం. అప్పు, సప్పు చేసి వాళ్లను చదివించిన. చేతికొచ్చిన కొడుకు ఆసరా అయితడనుకుంటే.. చివరకు ఇలా చనిపోతాడనుకోలే. ఈ వార్త విని కుంగిపోయాను.

– పసుల శ్రీనివాస్, రాహుల్ తండ్రి, పీపీ స్తంభంపల్లి, మహాముత్తారం మండలం

**ఈత సరదా ఆరుగురి ప్రాణాలు తీసింది.**

పెళ్లి వేడుక కోసం వచ్చి అప్పటిదాకా తమతోనే ఉన్న తమ బిడ్డలు అనుకోని దుర్ఘటనతో అనంతలోకాలకు వెళ్లిపోవడం ఆ తల్లిదండ్రులకు పుట్టెడు శోకం మిగిల్చింది. అందరూ 20 ఏళ్ల లోపు యువకులే చేతికొచ్చిన కొడుకులు ఇలా కండ్లముందే విగతజీవులుగా పడి ఉండడం చూసి గుండెలవిసేలా రోదించిన తీరు అక్కడున్న వారందరినీ కలచివేసింది. మేడిగడ్డ బరాజ్‌లో శనివారం సాయంత్రం గల్లంతైన అంబట్‌పల్లికి చెందిన పట్టి మధుసూదన్(18), పట్టి శివమనోజ్(15), తొగరి రక్షిత్(13), కర్ణాల సాగర్(16) మహాముత్తారం మండలం కొర్లకుంటకు చెందిన బొల్లెడ్ల రాంచరణ్(17), పసుల రాహుల్ (19) మృతదేహాలను ఆదివారం ఉదయం పోలీసులు, ఈతగాళ్లు, రెస్క్యూ బృందాలు బోట్లు, మృత్స్యకార వలలతో వెలికితీశారు. నదిలో మునిగిన తమ పిల్లలు ఏమయ్యారోనని 18 గంటలుగా గోదావరి ఒడ్డున ఎదురుచూస్తూ హాహాకారాలు చేసిన వారి కుటుంబసభ్యులు, బంధువులకు చివరకు నిరాశే మిగలగా.. ఈ సంఘటనతో అంబట్‌పల్లి, కొర్లకుంటల్లో తీవ్ర విషాదం నెలకొంది.

– మహదేవపూర్, జూన్ 8



గోదావరిలో వలలతో మృతదేహాలను బయటకు తీస్తున్న జాలర్లు



పట్టి మధుసూదన్, పట్టి శివమనోజ్, పసుల రాహుల్, తొగరి రక్షిత్, కర్నాల సాగర్, బొల్లెడ్ల రామ్‌చరణ్ (ఫైల్)

# విషాదాంతం..

## ఈత కోసం వెళ్లి గల్లంతైన ఆరుగురు అనంతలోకాలకు..

- 18గంటల గాలింపు తర్వాత మృతదేహాల వెలికితీత
- గోదావరి తీరంలో మృత్యుహేల
- ఒకే ఊరిలో నలుగురు.. శోకసంద్రంలో కుటుంబాలు
- దుర్ఘటనతో పెళ్లింట విషాద ఛాయలు
- మృతుల కుటుంబాలకు మంత్రి దుద్దిళ్ల, పుట్ట మధుకర్ పరామర్శ



మేడిగడ్డ బరాజ్ వద్ద మిన్నంటిన కుటుంబ సభ్యుల ఆర్తనాదాలు

మేడిగడ్డ బరాజ్‌లో శనివారం సాయంత్రం గల్లంతైన విద్యార్థుల ఆచూకీ అర్ధరాత్రి వరకు దొరకకపోవడంతో పరిస్థితులు అనుకూలించక గాలింపు నిలిపివేసి ఆదివారం ఉదయం మళ్లీ ప్రారంభించారు. 18 గంటల పాటు గాలింపులు జరిపి ఆదివారం మధ్యాహ్నం ఆరుగురి మృతదేహాలను వెలికితీశారు. చివరి మూడు మృతదేహాలను మత్స్యకారుల వలలతో గాలించి తీసుకొచ్చారు. కుళ్లిన స్థితిలో దుర్గంధం మధ్య మృతదేహాలను మహదేవపూర్ ప్రభుత్వ దవాఖాన మార్చురీకి తరలించి కుటుంబసభ్యులకు అప్పగించారు. ఈతకు వెళ్లి మృత్యుఒడిలోకి చేరిన పిల్లలను చూసి తల్లిదండ్రులు, బంధువులు కన్నీటి పర్యంతమయ్యారు. అంబట్‌పల్లిలో పెళ్లి వేడుకకు వచ్చి మృత్యువాత పడడంతో వేడుకల్లో విషాదఛాయలు అలుముకున్నాయి. మహదేవపూర్ మండలం అంబట్‌పల్లిలో పట్టి వెంకటస్వామి కుటుంబంలో ఈ నెల 5న జరిగిన వివాహ వేడుకల్లో పాల్గొనేందుకు అంబట్‌పల్లికి చెందిన పట్టి మధుసూదన్, పట్టి శివమనోజ్, తొగరి రక్షిత్, కర్ణాల సాగర్, మహాముత్తారం మండలం కొర్లకుంటకు చెందిన బొల్లెడ్ల రాంచరణ్, పసుల రాహుల్ వచ్చారు. వారి కోరిక మేరకు వెంకటస్వామి వారందరినీ మేడిగడ్డ గోదావరి తీరానికి ఈతకు తీసుకువెళ్లాడు. అందులో అతని ఇద్దరు కుమారులు కూడా ఉన్నారు. నీళ్లు ఎక్కువగా ఉన్నాయని, లోతుకు వెళ్లొద్దని వారించినా సెల్ఫీలు, రీల్స్ తీసుకుంటూ వెళ్లారు. ఈ క్రమంలో ఒక్కొక్కరుగా నీటి ప్రవాహంలో మునిగిపోవడం గమనించి వెంకటస్వామి వారిని కాపాడే ప్రయత్నం చేసినా ఫలితం లేదు. కళ్లముందే ఇద్దరు కుమారులు, బంధువుల పిల్లలు గల్లంతు కావడంతో ఒడ్డున రోదిస్తూ బంధువులకు సమాచారం అందించాడు. గ్రామానికి చెందిన ఈతగాళ్లతో పాటు అక్కడికి చేరుకున్న కాటారం డీఎస్పీ రామ్మోహన్‌రెడ్డి గజ ఈతగాళ్లను పిలిపించి గాలించారు. ఆదివారం అడిషనల్ కలెక్టర్ అశోక్‌కుమార్, అడిషనల్ ఎస్పీ నరేశ్ ఆధ్వర్యంలో ఎస్‌డీఆర్‌ఎఫ్, డీడీఆర్‌ఎఫ్, అగ్నిమాపక సిబ్బంది, సింగరేణి రెస్క్యూ టీం, పోలీసులు చేపట్టిన ఆపరేషన్‌తో మృతదేహాలను వెలికితీశారు. కాగా, మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అంబట్‌పల్లిలోని పట్టి వెంకటస్వామి, కర్నాల సాగర్ కుటుంబాలను ఆదివారం రాత్రి పరామర్శించారు. బాధిత కుటుంబాలకు ప్రభుత్వం నుంచి రూ.లక్ష చొప్పున ఎక్స్‌గ్రేషియా, అర్హులకు ఇందిరమ్మ ఇండ్లు ఇస్తామని హామీ ఇచ్చారు.

### ప్రభుత్వానిదే బాధ్యత..

**పుట్ట మధుకర్, మంథని మాజీ ఎమ్మెల్యే**

మేడిగడ్డ ఘటనకు ప్రభుత్వమే బాధ్యత వహించాలని మంథని మాజీ ఎమ్మెల్యే, బీఆర్‌ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి మధుకర్ డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన మహదేవపూర్ ప్రభుత్వ ఆస్పత్రి వద్ద మృతుల కుటుంబాలను పరామర్శించి ఓదార్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం కుట్రపూరితంగానే మేడిగడ్డను పక్కన పెట్టిందని, అక్కడ వరద ప్రవాహం పెరుగుతున్నదని తెలిసినా ఎలాంటి రక్షణ చర్యలు చేపట్టలేదని ఆరోపించారు. ప్రభుత్వ వైఫల్యంతోనే అభంశుభం తెలియని ఆరుగురు పిల్లలు ప్రాణాలు కోల్పోయారన్నారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి కుటుంబానికి రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా ఇచ్చి ఆదుకోవాలని, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని డిమాండ్ చేశారు. ఆయన వెంట బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు లింగంపల్లి శ్రీనివాసరావు, మహిళా విభాగం మండలాధ్యక్షురాలు ఓడేటి స్వప్న, యూత్ అధ్యక్షుడు ఎండీ అలీమ్‌ఖాన్, సీనియర్ నాయకులు ప్రకాశ్, కూరతోట శ్రీహరి, కారెంగుల బాపురావు, వంశీ తదితరులున్నారు.



బాధిత కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు



బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న మంత్రి శ్రీధర్ బాబు



### చేతికొచ్చిన కొడుకులు కళ్ల ముందే కొట్టుకుపోయిండ్రు..

మాది అంబట్‌పల్లి గ్రామం. నాకు ఇద్దరు కొడుకులు పట్టి మధుసూదన్, శివమనోజ్‌తో పాటు ఒక బిడ్డ ఉంది. కొడుకులు ఇద్దరు వేసవి సెలవుల కోచింగ్‌లో ఉన్నరు. ఈ నెల 5న నా మరదలు పెళ్లి కోసం ఊరికి వచ్చారు. బంధువులతో కలిసి ఫొటోల కోసం వారిని మేడిగడ్డ బరాజ్‌కు నేనే తీసుకపోయిన. అక్కడ ఫొటోలు దిగి స్నానం చేస్తుండగా నా కళ్ల ముందే నా ఇద్దరు కొడుకులతో పాటు మరో నలుగురు నదిలో కొట్టుకుపోయిండ్రు. చేతికొచ్చిన కొడుకులు ఇలా దూరమవడం చూసి నా గుండె తరుక్కుపోతున్నది. నా కుటుంబానికి ఇంతటి దారుణ పరిస్థితి వస్తుందని అనుకోలే. చదువులో చురుగ్గా ఉండే నా కొడుకులు భవిష్యత్‌లో ప్రయోజకులవుతారని ఆశపడ్డా. కానీ, ఇలా అవుతుందనుకోలే. కూలి చేసుకునే మేము ఇప్పుడు దిక్కులేకుంట అయినం. ప్రభుత్వమే మమ్మల్ని ఆదుకోవాలి. – పట్టి వెంకటస్వామి, అంబట్‌పల్లి, మహదేవపూర్ మండలం

### మంచిగ చదివెటోడు



నాకు కొడుకు సాగర్, బిడ్డ స్రవంతి కవల పిల్లలు. కొడుకు పదో తరగతి పూర్తి చేసి ప్రస్తుతం ఇంటర్ చదువుతున్నాడు. నా కొడుకే నా ప్రపంచం. చదువులో చురుగ్గా ఉండేటోడు. ఎలాంటి చెడు అలవాట్లు లేవు. స్నేహితులతో కలిసి బరాజ్‌కు వచ్చి మృతి చెందడం కలచివేసింది. మేము కూలీ పని చేసుకొని బతికేటోళ్లం. మాకు భూములు, జాగలు లేవు. నా కొడుకు మృతితో మా బతుకులు రోడ్డు మీద పడ్డాయి. చేతికి అందిన కొడుకు ఇక లేడని తెలిసి ఏం చేయాలో అర్థం అయితలేదు. ఇలాంటి గర్భశోకం ఏ తల్లిదండ్రులకు రాకూడదు. పుట్టెడు దుఃఖంలో ఉన్న మా కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలి. – కర్నాల సమ్మయ్య, సాగర్ తండ్రి, అంబట్‌పల్లి, మహదేవపూర్ మండలం

### ప్రాణాలతో బయటపడతా అనుకోలే..



మేడిగడ్డ బరాజ్‌లో స్నానం చేసేందుకు మొదట నలుగురు, తరువాత మరో ఇద్దరు దిగారు. వారికి ఈత రాకపోవడంతో ఒకరి వెనుక ఒకరు నీట మునిగిపోతున్నరు. కొద్ది క్షణాల్లోనే స్నానానికి వెళ్లిన ఆరుగురు మునిగిపోయారు. అందులో మధుసూదన్ మునిగిపోతుంటే నా చేయి పట్టుకొని కాపాడేందుకు యత్నించినప్పటికీ అది సాధ్యం కాలేదు. నాకేం చేయాలో తెలియక భయపడి అక్కడి నుంచి వెంటనే ఒడ్డుకు చేరుకున్న. నా కళ్ల ముందే ఆరుగురు నదిలో మునిగిపోవడం చూసి ఆందోళనకు గురయ్యా. విషయాన్ని వారి కుటుంబ సభ్యులు, స్థానికులకు చెప్పిన. ఇప్పటికీ ఆ దృశ్యాలే నా కళ్ల ముందు మెదులుతున్నయ్. ఆ భయం ఇప్పటికీ పోతలేదు. నేను ప్రాణాలతో బయటపడతా అనుకోలేదు. – పట్టి శివమణి, ప్రాణాలతో బయటపడిన యువకుడు

### ఎన్నో ఆశలు పెట్టుకున్నం..



మాకు ఒక కొడుకు రక్షిత్‌తో పాటు కూతురు ఉంది. కొడుకు అంబట్‌పల్లి ప్రభుత్వ పాఠశాలలో 9వ తరగతి చదువుతున్నడు. మేము హమాలీ పని చేసి బతుకుతున్నం. నా కొడుకుపై ఎన్నో ఆశలు పెట్టుకున్నం. ఇలా చనిపోవడాన్ని జీర్ణించుకోలేకపోతున్నం. తలకొరివి పెట్టాల్సిన కొడుకు చిన్నతనంలోనే చనిపోవడం మా కుటుంబంలో విషాదం నింపింది. రెక్కాడితే గానీ పూట గడవని పరిస్థితి మాది. మా కుటుంబానికి పెద్దదిక్కు అయితడు అనుకుంటే మమ్ముల ఆగం చేసి పోయిండు. – తొగరి సాంబ, రక్షిత్ తల్లి, అంబట్‌పల్లి, మహదేవపూర్ మండలం



కాజీపేటలోని చేపల దుకాణాల వద్ద కొనుగోలు చేసేందుకు బారులు తీరిన ప్రజలు

## మృగశిర సందడి

### చేపలు కొనేందుకు ప్రజల బారులు

మృగశిర కార్తెని పురస్కరించుకొని ఆదివారం చేపల విక్రయదారులతో ఉమ్మడి జిల్లావ్యాప్తంగా మార్కెట్లు, కూడళ్లు సందడిగా మారాయి. కార్తె తొలి రోజు చేపలు తింటే ఆరోగ్యానికి మంచిదని, వ్యాధులు దూరమవుతాయనే నమ్మకంతో ఎక్కువ మంది ప్రజలు వాటిని కొనుగోలు చేశారు. చేపలు కొనేందుకు బారులు తీరారు. వ్యాపారులు ధరలు పెంచినా మృగశిర నాడు చేపలను తినాలని డబ్బులకు వెనుకాడలేదు. కిలోకు రూ. 100–120 ఉండే తెల్ల చేపలు 180 నుంచి 250 వరకు, బొమ్మె చేపలను ఏకంగా రూ. 500–600లు పెట్టి కొనుగోలు చేశారు. – నమస్తే నెట్‌వర్క్

- ఖాళీ సంచులను వరుసలో పెట్టి.. గొడుగులు ధరించి
- సన్నబియ్యం కోసం రేషన్ లబ్ధిదారుల అవస్థలు



హనుమకొండ రెడ్డి కాలనీలోని రేషన్ షాపు వద్ద గొడుగుతో నిల్చున్న లబ్ధిదారులు



తొర్రూరు: ఖాళీ సంచులను వరుసలో పెట్టి నీడలో కూర్చున్న లబ్ధిదారులు

## మిషన్ పనిచేయక.. ఎండ తీవ్రతకు తాళ లేక

ఈ-పాస్ మిషన్ పనిచేయక.. గంటల తరబడి ఎండ తీవ్రతకు తాళలేక రేషన్‌కార్డు లబ్ధిదారులు అవస్థలు పడుతున్నారు. దుకాణాల వద్ద నీడ లేకపోవడంతో ఖాళీ సంచులను వరుసలో పెట్టి సమీపంలోని చెట్ల కింద కూర్చుంటున్నారు. మూడు నాలుగు సార్లు థంబ్ వేస్తుండడంతో సమయం ఎక్కువగా పట్టి ఎండకు అల్లాడిపోతున్నారు. కొందరు గొడుగులు తెచ్చుకుని మరీ క్యూలో నిల్చుంటున్నారు. – స్టాఫ్ ఫొటోగ్రాఫర్, వరంగల్ / తొర్రూరు